భూ హక్కు చట్టంపై రిట్ పిటీషన్

శ్రీకాకుళం అర్బన్ : ఎపి భూ హక్కు చట్టంపై రిట్ పిటీషన్ దాఖలు చేసినట్లు బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన ఈ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల ఆధ్వర్యాన న్యాయవాదులు పెద్దసంఖ్యలో పలురూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. ఈ చట్టం అమల్లోకి వస్తే సామాన్యులకు తీవ్ర స్థాయిలో నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే హైకోర్టులో జిల్లా బార్ అసోసియేషన్ తరుపున ఆ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ జిల్లాకు చెందిన హైకోర్టు న్యాయవాది సువ్వారి శ్రీనివాసరావు ద్వారా రిట్ పిటీషన్ దాఖలు చేశామని తెలిపారు. ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రబీలోనూ వర్షాభావ పరిస్థితులే..

- **రబీలో సాధారణ విస్తీర్ణం 2,16,340 ఎకరాలు**
- **1,15,985 ఎకరాల్లోనే పంటలు వేయగలిగిన రైతులు**
- **గతేడాది ఇదే సమయానికి 1,67,090 ఎకరాల్లో సాగు**
- **13 మండలాల్లో తీవ్ర వర్షపాతం లోటు**

జిల్లాలో గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల వేలాది ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోయారు. సకాలంలో వర్షాలు కురవక వేసిన పంటలూ ఎండిపోయాయి. దీంతో రబీపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. రబీలోనూ ప్రస్తుతం అవే పరిస్థితులు నెలకొన్నాయి. రబీలో వరి వేయొద్దని ఇప్పటికే అధికారులు రైతులకు సూచించారు. వర్షాలు లేకపోవడంతో వంశధారలో నామమాత్రంగా ఇన్‌ఫ్లో ఉండగా, నాగావళిలో నీటి ప్రవాహం జీరో లెవల్స్‌కు పడిపోయింది. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో, రైతులు విత్తనాలు వేయలేకపోతున్నారు. ప్రతి ఏడాది డిసెంబరులో కురిసే వర్షాలతో నేలలో తేమశాతం పెరిగి అపరాల సాగుకు దోహదపడుతుంది. ఈ ఏడాది వర్షాల్లేకపోవడంతో అపరాల సాగుపైనా తీవ్ర ప్రభావం చూపింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రబీలో సాధారణంగా అన్నిరకాల పంటలు కలిపి మొత్తం 2,16,340 ఎకరాల్లో సాగవుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 1,15,985 ఎకరాల (54 శాతం) మేర సాగు అయింది. 2022-23 రబీలో ఇదే సమయానికి 1,67,090 ఎకరాల్లో (77.23 శాతం) పంటలు సాగయ్యాయి. వరి పంటను 21,150 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 9,183 ఎకరాల్లో (43 శాతం) వేశారు. గతేడాది ఇదే సమయానికి 17,080 ఎకరాల్లో (80.76 శాతం) వేశారు. మొక్కజొన్న పంటను 38,163 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, 30,430 ఎకరాల్లో (79.74 శాతం) వేశారు. రాగులను 5,425 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 2,995 ఎకరాలో (54 శాతం) వేశారు. చెరుకు పంటను 3,675 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 158 ఎకరాల్లో (4 శాతం) వేశారు. వేరుశనగ పంటను 10,660 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 8,485 ఎకరాల్లో (80 శాతం) వేశారు. రబీలో 11,152 ఎకరాల్లో నువ్వులు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 3,480 ఎకరాల్లో (25 శాతం) వేయగలిగారు. గతేడాదితో పోల్చితే అదనంగా 190 ఎకరాల్లో సాగు అయింది. పొద్దుతిరుగుడు పంటను 848 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, 28 ఎకరాల్లో (3 శాతం) మాత్రమే విత్తనాలు వేయగలిగారు.



బూర్జ మండలం నీలకంఠాపురంలో నీరు లేక ఎండిన పంట కాలువ

అపరాల సాగుపై తీవ్ర ప్రభావం

డిసెంబరులో వర్షాలు పెద్దగా లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నేలలో తేమ శాతం తక్కువగా ఉండడంతో మినుము, పెసర పంటలను వేయలేకపోయారు. రబీలో పెసర సాధారణ సాగు 46,645 ఎకరాలు ఉండగా, ఇప్పటివరకు 21,965 ఎకరాల్లో (47 శాతం) సాగవుతోంది. గతేడాది ఇదే సమయానికి 31,918 ఎకరాల్లో (68.43 శాతం) మేర సాగు అయింది. మినుము సాధారణంగా 70,340 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా 35,195 ఎకరాల్లో (50 శాతం) వేశారు. 2022-23 రబీలో 51,012.5 ఎకరాల్లో (72.52 శాతం) మేర మినప పంట సాగు అయింది. ఉలవలను 3,220 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 603 ఎకరాల్లో (19 శాతం) వేశారు. కట్టె జనుమును 2,270 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 3,465 ఎకరాల్లో వేశారు. వర్షాలు లేకపోవడం, వంశధార, నాగావళిలో నీటి ప్రవాహం జీరో లెవల్స్‌కు పడిపోవడంతో పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

13 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

జిల్లాలో సాధారణంగా ఈ సీజన్‌లో 1002.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. ప్రస్తుతం 768 మి.మీ వర్షం కురిసింది. 30 మండలాలకు గానూ 13 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. నందిగాం మండలం అత్యంత లోటు వర్షపాతం ఉన్న జాబితాలో ఉంది. ఎల్‌ఎన్‌పేట మండలం అధిక వర్షపాతం కురిసిన జాబితాలో ఉంది.

రిజర్వాయర్లలో అడుగంటిన నీటి నిల్వలు

మునుపెన్నడూ లేని విధంగా వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం దారుణంగా పడిపోయింది. ఒడిశాల్లోనూ వర్షాలు లేకపోవడంతో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. వంశధారలో ప్రస్తుతం ఇన్‌ఫ్లో 150 క్యూబిక్ మీటర్లు మాత్రమే ఉంది. గతేడాది ఇదే సమయానికి సుమారు 400 క్యూసెక్కుల వరకు నీటి ప్రవాహం ఉంది. హిరమండలం రిజర్వాయర్‌లో ఉన్న 2.5 టిఎంసిల నీటిని ఖరీఫ్‌లో చివరి తడుపులకు వినియోగించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో సంక్రాంతి తర్వాత అధికారులు నీటి విడుదలను ఆపేశారు. గొట్టాబ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.13 టిఎంసిలకు పడిపోయింది. తోటపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 2.5 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 1.38 టిఎంసిల నీరే ఉంది. మడ్డువలస రిజర్వాయర్ కింద ఆయకట్టు భూములకు సాగునీరు అవసరం లేదని రైతులు చెప్పడంతో అధికారులు నిలిపేసినట్లు తెలుస్తోంది.



మాట్లాడుతున్న సిఐటియు సీనియర్ నాయకులు శ్రీనివాసు

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

ముసిగిన ఇపిఎస్ పెన్షనర్ల రిలే దీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వాలని సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పార్వతీశం, ఆదినారాయణ మూర్తి డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని జ్యోతిరావుపూలే పార్కు వద్ద ఐదు రోజుల పాటు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 75 లక్షల మంది ఇపిఎస్ పెన్షనర్లు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని, వారిపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. సుమారు 80 శాతం మందికి రూ.రెండు వేలకు మించి పెన్షన్ రావడం లేదని, రూ.వెయ్యి లోపు పెన్షన్ తీసుకుంటున్న వారు లక్షలాది మంది ఉన్నారని చెప్పారు. పెరుగుతున్న ధరలు, వృద్ధాప్యంలో ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలకు పెన్షన్ సరిపోక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.మూడు వేలు, కరువుభత్యం ఇస్తామని 2014లో ఎన్నికల మేనిఫెస్టోలో బిజెపి ప్రకటించిందని గుర్తుచేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నా ఆ హామీని అమలు చేయడం లేదని విమర్శించారు.

ఇపిఎస్ పెన్షన్ కార్పస్ ఫండ్ సుమారు రూ.ఏడు లక్షల కోట్లు ఉందని, దానిపై వడ్డీ రూ.51 వేల కోట్లు వచ్చిందని చెప్పారు. అందులో 25 శాతం మాత్రమే పెన్షన్ కోసం వెచ్చిస్తున్నారని తెలిపారు. 2014 తర్వాత ఉద్యోగంలో చేరిన వారు సిపిఎస్ పరిధిలోకి వస్తారని, దీనివల్ల భవిష్యత్‌లో ఇపిఎస్ పరిధిలోని ఉద్యోగులు, పెన్షనర్ల సంఖ్య తగ్గుతుందన్నారు. అందువల్ల ఎటువంటి భారం లేకుండా పెన్షన్ పెంపునకు వీలుందన్నారు. వృద్ధులకు గతంలో ఇచ్చిన రైల్వే రాయితీని పునరుద్ధరించాలని, పెన్షన్ లెక్కింపులో ప్రొరేటా పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు ఉపాధ్యాయ సంఘ నాయకులు బొనిగి భాస్కరరాఉ, ఎపిఆర్‌పిఎ నాయకులు బి.జనార్ధనరావు సంఘీభావం తెలిపారు.

వైసిపి నాయకునిపై దాడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వైసిపి నాయకుడు, ఎచ్చెర్ల వైస్ ఎంపిపి ప్రతినిధి, మాజీ సర్పంచ్ జరుగుల శంకరరావుపై గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. తన వాహనంపై వెళ్తున్న శంకర్‌ను ఎచ్చెర్ల సమీపంలోని ట్రిపుల్ ఐటి వద్ద దారికాసి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శంకరరావు భార్య విజయకుమారి ప్రస్తుతం ఎచ్చెర్ల వైస్ ఎంపిపిగా ఉన్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నాయకుల్లో ఒకరిగా ముద్ర పడ్డారు. దాడికి పాల్పడిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎచ్చెర్ల ఎస్ఐ చిరంజీవి ఆస్పత్రికి చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు. దాడి వెనుక ఎచ్చెర్ల మండలంలోని అధికార పార్టీ చెందిన ఒక ముఖ్య నాయకుని హస్తం ఉందనే చర్చ సాగుతోంది. ఈ ఘటనతో ఎచ్చెర్లలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

రైతుల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయాధారిత జిల్లాలో వ్యవసాయ సలహా మండలి తీసుకునే నిర్ణయాలు రైతాంగానికి విస్తృత ప్రయోజనం కల్పించేవిగా ఉండాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖలు, జలవనరుల శాఖ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. వ్యవసాయంతో ముడిపడి ఉన్న అనుబంధ శాఖలన్నీ సమన్వయం చేసుకుంటూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆయా రైతాంగానికి పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ తదితర శాఖల్లో ఖాళీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు నకిలీలు లేకుండా చూడాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా జిల్లా నుంచి ప్రభుత్వానికి పంపిన నివేదికలపై అడిగి తెలుసుకున్నారు. శాఖల వారీగా నిర్ణయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, కిసాన్ క్రెడిట్ కార్డులు, ఉచిత విద్యుత్, స్మార్ట్ మీటర్లు, ఇన్పుట్ సబ్సిడీ , పశు భీమా, మట్టి నమూనాలు తదితర అంశాలపై వివరాలు అడిగారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు చెల్లింపులు రెండు వారాల్లో పూర్తి చేయాలన్నారు.

వంశధార పై సుదీర్ఘ చర్చ

వంశధార ప్రాజెక్టు స్థితిగతులపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఒడిశాతో నేరడి వివాదాన్ని, సైడ్‌వియర్ పనితీరు, సింగిడి, పారపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లను గురించి అడిగి తెలుసుకున్నారు. హిరమండలం ప్రధాన రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్‌పై పలు ప్రశ్నలు అడిగారు. రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తి అయనట్టు, ప్యాకేజీ 87, 88 పనులను, కాలువల పరిస్థితిని ప్రాజెక్టు ఎస్ఇ డోల తిరుమలరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధాన రిజర్వాయర్ కోసం ప్రభుత్వం ఎత్తిపోతల పథకం మంజూరు చేసిందని, 20 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ ఏడాది గొట్టా నుంచి నీటిని పంపుల ద్వారా రిజర్వాయర్‌కి తరలించి 19 టిఎంసిల నీటిని నిల్వ ఉంచడమే లక్ష్యమన్నారు. నేరడి బ్యారేజీ, వంశధార ట్రిబ్యునల్, స్టేజ్-1, స్టేజ్-2, ఆఫ్‌షోర్, మడ్డువలస, నారాయణపురం పనుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, వ్యవసాయ, పశుసంవర్థకశాఖ జెడిలు కె.శ్రీధర్, ఎం.కిషోర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, నీటిపారుదల శాఖ ఎస్ఇ పి.సుధాకరరావు, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డిఎం రమణి, ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి ప్రసాద్, మార్కెటింగ్ ఎడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 16న అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య అన్నారు. రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై ఆలయంలోని అనివెట్టి మండపంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ, రెవెన్యూ, పోలీసు, రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తుగా జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, నిరంతరం తాగునీటిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. వికలాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్స్ ఏర్పాటు చేసి, అవి ఎక్కడ అందుబాటులో ఉన్నాయో తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం సిసి కెమెరాలు పనిచేసేలా చూడాలని, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రెవెన్యూ, దేవాదాయశాఖ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో వాహనాల పార్కింగ్‌కి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పట్నాయక్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, సిఐ ఎల్.ఎస్ నాయుడు, ట్రాఫిక్ సిఐ అవతారాం, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ రంగయ్య

మహిళల హాకీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ జూనియర్ మహిళల 14వ హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు మండలం లోని పాత్రునివలసలో గల స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. ఉత్తమ ప్రతిభను కనబరచడం ద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ స్థాయి మొదలుకొని ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించిందని తెలిపారు.



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు హెచ్చరించారు. స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం పరిశీలించి విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు వండి పెడుతున్న భోజనంలో నాణ్యమైన పప్పును మాత్రమే వినియోగించాలని సూచించారు. చీపుర్లపాడులో రేషన్ డిపోను తనిఖీ చేసి కాటాను పరిశీలించారు. రెన్యువల్ చేయించుకోకపోవడంతో అపరాధ రుసుము విధించాలని తూనికలు, కొలతలశాఖ అధికారులను ఆదేశించారు. స్టాక్ బోర్డు లేకపోడంపై మెమో ఇవ్వాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు గోపాలరావు, దామోదరరావు, డిప్యూటీ తహశీల్దార్ కె.రాము, పాఠశాల హెచ్‌ఎం డి.గోవిందరావు, ఫుడ్ సేఫ్టీ, తూనిక కొలతల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న కాంతారావు

పోస్టల్ బ్యాలెట్‌పై డిక్లరేషన్ సరిచూసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోస్టల్ బ్యాలెట్‌పై ఉన్న డిక్లరేషన్, సంబంధిత ఫారాలు అన్నీ సరిచూసుకోవాలని మాస్టర్ ట్రైనర్, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు చెప్పారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలు - 2024కు సంబంధించి (ఎఎల్‌ఎంటి) మాస్టర్ ట్రైనర్స్ శిక్షణా తరగతుల్లో జిల్లా మాస్టర్ ట్రైనర్స్ చిట్టిరాజుతో పాటు మెప్మా పీడీ కిరణ్ కుమార్, గార మండలం ఉప్పరవానిపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శేషగిరిరావు పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంలు, పోలింగ్ సంబంధిత అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసు ఓటర్లు, డ్యూటీ చేసిన వారి ఓట్లనేవి రెండు రకాలుగా ఉంటాయన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు అవసరమైన పేపర్లు కలిపి పెట్టాలని వివరించారు. పోస్టల్ బ్యాలెట్‌కు అన్నీ పక్కాగా ఉంటేనే ఆ ఓట్లను పరిగణనలోకి తీసుకుంటారని చెప్పారు. డిక్లరేషన్లు శాసనసభ, పార్లమెంట్‌కు వేర్వేరుగా ఉంటాయన్నారు. సెక్టోరియల్ అధికారులు ఎన్నికల్లో ఎలాంటి విధులు నిర్వహిస్తున్నదీ మెప్మా పీడీ కిరణ్ కుమార్ అవగాహన కల్పించారు. ప్రతి అంశంపై చాప్టర్ వారీగా చర్చ రూపంలో నిర్వహించారు.



నులిపురుగులతో రక్తహీనత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పిల్లల్లో రక్తహీనతకు నులిపురుగులు కారణమని, వాటి నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నారులకు మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 నుంచి 19 ఏళ్ల మధ్య గల వారు ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. ఇవి వేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఎవరికైనా సమస్య తలెత్తినట్లు అనిపిస్తే వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లాలో 4.64 లక్షల మంది పిల్లలు ఉన్నారని, వారందరూ ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలలు ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వీటివల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు తరచూ ఎదురవుతుంటాయన్నారు. నులిపురుగుల నిర్మూలనా మాత్రలు వేసుకోని వారు ఈనెల 16న మాప్ అప్ డే రోజున వేసుకోవాలన్నారు. రానున్న వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని, అందువల్ల తరచూ మంచినీరు తాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జిల్లా కోర్డినేటర్ డాక్టర్ సి.పి శ్రీదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, పట్టణ వైద్యులు రమ్య తదితరులు పాల్గొన్నారు.



మాత్రలు మింగిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్


రైతుభరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

పలు అభివృద్ధి పనులు ప్రారంభం


ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేదారిపురం చీకటి రోడ్‌కు శుక్రవారం జెడ్‌పి చైర్‌పర్సన్ రూ.80లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం కేదారిపురంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్ర భవనం ప్రారంభించారు. అదే విధంగా మండలం, టి.భరంపురంలో సీతారామ కళ్యాణ మండపం నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి మొదటి విడతగా రూ.ఐదు లక్షల నిధులతో శంకుస్థాపన చేసారు. అలాగే మందపల్లి గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో విస్తృతంగా పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, కంచిలి ఎంపిపి పైలా దేవదాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.బాబూరావు, చాట్ల తులసిదాస్, దువ్వు వివేకానంద, దున్న గురుమూర్తి, సర్పంచ్ నీలాపు సారధి రెడ్డి, నీలాపు జగదీష్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థుల సృజనాత్మకత భేష్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో 'ఐతమ్ అటల్ ఇన్నోవేషన్ ఛాలెంజెస్ (సెషన్-2)' లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా హాజరైన జిల్లాలో 23 పాఠశాలల విద్యార్థులు పలు ప్రాజెక్టుల ద్వారా అత్యంత సృజనాత్మకతను వ్యక్తం చేయడం పట్ల ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం శుక్రవారంతో ముగిసిందన్నారు. పాఠశాల విద్యార్థులకు ఐతమ్ విద్యార్థులు తగిన సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతికి, సమాజానికి అవసరమైన సమస్యలను గుర్తించి వాటికి తగిన పరిష్కాలు వెతుకుతూ విద్యార్థులు చేసే సాంకేతిక ప్రయత్నం అద్భుతమన్నారు. కార్యక్రమంలో యునిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి టి.సుదర్శనరావు, జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.రఘువీర్, ఆటోమొబైల్ క్లబ్ ఇన్‌ఛార్జి ఎం. వంశీనారాయణ్, అటల్ ల్యాబ్ సైన్స్ అధ్యాపకులు పర్యవేక్షణ చేశారని ప్రొఫెసర్ నాగేశ్వరరావు తెలిపారు.


మగ్గాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీరామమూర్తి తదితరులు

చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- నందిగాం

చేనేత కార్మికుల సంక్షేమానికి సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి తెలిపారు. మండలం పెద్దతామరపల్లిలో శుక్రవారం చేనేత కార్మికులకు ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన బట్టలు నేసే మగ్గాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి చేనేత కార్మికులకు నేతన్న నేస్తం అందజేస్తున్నారని, 50 ఏళ్ల నిండిన కార్మికులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. చేనేత కార్మికులంతా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఎడి ధర్మారావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు తమరి ఫల్గునరావు, మండల జెసిఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం, సర్పంచ్ తమరి దేవేంద్రరావు, ఎంపిటిసి సైలాడ లావణ్య, అంబోడి విష్ణు, టి.రామారావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అర్హత గల మహిళలందరికీ అందిస్తున్న వైఎస్ఆర్ చేయూత నిధులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలం కలివరంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ స్థాయి సిబ్బంది సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా కుటీర పరిశ్రమల అభివృద్ధితో పాటు కిరాణా మార్ట్‌ల ఏర్పాటు, పశుపోషణ, పాల ఉత్పత్తుల పెంపుదలకు ప్రోత్సహించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో చేయూత లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లకు అవసరమైన పెట్టుబడి రుణ సౌకర్యాన్ని శ్రీనిధి బ్యాంక్ ద్వారా అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు, రైతు సంఘాల కో-ఆర్డినేటర్ రామప్పడుతో పాటు విఒఎలు పాల్గొన్నారు.


సిసి రహదారి పనులను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి కాంతారావు

సిసి రహదారుల నిర్మాణాలు

ప్రజాశక్తి- పొందూరు

మండలం లోలుగులో సిసి రహదారుల నిర్మాణ పనులు శుక్రవారం చురుగ్గా చేపడుతున్నారు. గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు వీధుల్లో ఈ సిసి రహదారుల నిర్మాణాలను జరుపుతున్నట్లు సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు తెలిపారు. గ్రామంలో సిసి రహదారుల నిర్మాణాలు చేపట్టడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యుగంధర్

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

ప్రజాశక్తి- పలాస

25వేలతో మెగా డిఎస్‌సి విడుదల చేయాలని, అప్రెంటిస్ విధానం రద్దు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు గోరు వాసు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ సిపిఐ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో సిఎం జగన్మోహన్ రెడ్డి విఫలమయ్యారన్నారు. ఎన్నికల ముందు మెగా డిఎస్‌సి ఇస్తామని చెప్పి ఐదేళ్లుగా నిరుద్యోగులను ఊరించి మోసం చేశారని ఆరోపించారు. అప్రెంటిస్ విధానం తీసుకువచ్చి నిరుద్యోగులను నిలువునా మోసం చేశారన్నారు. రాష్ట్రంలో 25వేల ఉపాధ్యాయులు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని మెగా డిఎస్‌సి ద్వారా భర్తీ చేస్తామని చెప్పి నేడు 6,100 పోస్టులు ఇవ్వడం మోసానికి నిదర్శనమన్నారు. మెగా డిఎస్‌సి ఇవ్వకపోతే అఖిల భారత యువజన సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 11న సిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు వల్లభరావు, వెంకటరావు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం


కవిటి : విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంఇఒ


మెళియాపుట్టి : మాత్రలు వేస్తున్న వైద్యాధికారి హేమంతలక్ష్మి

ప్రజాశక్తి- కవిటి

నులిపురుగుల నివారణతో బాలబాలికల ఆరోగ్యం మెరుగుపడుతుందని రాజపురం పిహెచ్‌సి వైద్యాధికారి మౌనిక, ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. కవిటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజపురం పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం నులి పురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది అభిమన్యు సోయి, కేశవరావు, ఆశా కార్యకర్తలు, హెచ్ఎం బి.వరలక్ష్మి, ఉపాధ్యాయులు రామకృష్ణ, కృష్ణ, సింహాచలం, అప్పలరాజు, నాగమణి, గోపి పాల్గొన్నారు.

పోలాకి : పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నులిపురుగుల నిర్మూలనలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీనాథ్, ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవికుమార్, పిహెచ్ఎన్ ఈశ్వరమ్మ, మంగం శేఖర్ బాబు, లక్ష్మి పర్యవేక్షకులు, ఉపకేంద్ర సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశాలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలో పలు పాఠశాలల్లోనూ, కళాశాలల్లో నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హేమంత లక్ష్మి, పావని, గ్రీష్మ, అధికారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జ్ఞానభారతి పాఠశాలలో జాతియ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 'డీ' వార్మింగ్ మాత్రలను పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది శాంతికుమారి, నారాయణరావు, ఆశా వర్కర్లు ఎస్.శోభారాణి, సంతోషి, ఇందిర మాత్రలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి జాహరాఖాన్, ప్రిన్సిపాల్ ఐ.పండా, వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కురిగాం పిహెచ్‌సి వైద్యులు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు, వసప కెజిబివి


పోలాకి : ఏలిక పాము ఆకారంలో కూర్చున్న విద్యార్థులు


ఇచ్ఛాపురం : మాత్రలు వేస్తున్న జోహార్‌ఖాన్

పాఠశాల విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ బుచ్చిబాబు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో కింతలి, తాడివలస పిహెచ్‌సిల పరిధిలో పలు ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో నులిపురుగల నివారణ దినోత్సవం నిర్వహించారు. కింతలి పిహెచ్‌సి పరిధిలో 4,003 మందికి, తాడివలస పిహెచ్‌సి పరిధిలో 7,220 మంది విద్యార్థులకు ఆల్బండాజోల్ మాత్రలను వేశారు. వైద్యాధికారులు రమేష్‌నాయుడు, శివశంకర్, సుదీర్‌కుమార్, నవీన్‌కల్యాణం, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలగలను బిసిల్లో చేర్చాలి

ప్రజాశక్తి- లావేరు

ఉత్తరాంధ్ర జిల్లాల్లోని తెలగ సామాజిక వర్గాన్ని బిసి జాబితాలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంఘం నాయకులు పల్లంట్ల వెంకట రామారావు (పివిఆర్) అన్నారు. తెలగ సామాజిక తరగతిని బిసి జాబితాలో చేర్చాలని కోరుతూ ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం లావేరులో ప్రారంభించడానికి ముందు విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో తెలగ సామాజిక వర్గం సుమారు పదిలక్షల వరకు ఓటర్లుగా ఉన్నారని, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు తెలగలను తమ ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి తప్ప, వారి హక్కుల పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న తమ సామాజిక వర్గం పిల్లలు విద్య, ఉద్యోగాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికల్లో తమ ఎన్నికల మేనిఫెస్టోలో తెలగ సామాజిక వర్గాన్ని బిసి జాబితాలో చేర్చుతామని పొందు పర్చాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం లావేరు కూడలిలో ఉన్న స్వర్గీయ వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం లావేరు, బొడ్డపాడు, గురుగుబిల్లి, సుభద్రపురం, తాళ్లవలస, రావివలస గ్రామాల మీదగా పాదయాత్ర సాగింది. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, లంకలపల్లి ప్రసాద్, పైడిభీమవరం సర్పంచ్ రౌతు శ్రీనువాసరావు, తెలగ సంఘం నాయకులు తిరుపతిరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తెలగలకు ఎమ్మెల్యే సంఘీభావం

రణస్థలం: తెలగ సామాజిక వర్గాన్ని బిసి జాబితాలో



మాట్లాడుతున్న వెంకట రామారావు

చేర్చాలనే నినాదంతో ఉత్తరాంధ్రలో (ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట) వరకు పాదయాత్ర చేస్తున్న పల్లంట వెంకట రామారావుకు జె.ఆర్.పురంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలగలను బిసిలో చేర్చడంతో పాటు కేంద్రంలో ఒబిసిలో చేర్చి విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో స్థానం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. తెలగ సామాజిక వర్గాల సమస్యలను సిఎం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.


పలాస : సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

శంఖారావం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కంబిరిగాం జంక్షన్ జాతీయ రహదారికు సమీపంలో ఆదివారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష టిడిపి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారా లోకేష్‌కు స్వాగతం పలకడం నుంచి తిరిగి ప్రయాణం అయ్యేవరకు నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, దువ్వాడ హేంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఈ నెల 11న ఇచ్ఛాపురం నుంచి ప్రారంభం కానున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎన్నికల సమర శంఖారావం విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త సంసిద్ధంగా ఉండాలని టిడిపి నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలో తోటవీధి మైదానంలో జరిగిన టిడిపి కార్యకర్తల సమావేశానికి మండలంలో అన్ని గ్రామాల నుంచి భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు దక్కత ఢిల్లీరావు, దక్కత శ్రీనివాసరావు, సహదేవ్ రెడ్డి, మెరుగు సూర్యనారాయణ మాట్లాడారు. టిడిపికి ఇచ్ఛాపురం కంచుకోట అని, దీనిని ఎవరు ఢీ కొట్టలేరని మరోసారి మన కంచుకోట దెబ్బ ప్రత్యర్థులకు చూపించాలన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన అంతం కావాలంటే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మళ్లీ రావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు లోపింటి పద్మనాభం, కామేశ్వరరావు, ఎకంబరి దేవి, లోహిదాస్, కోట రామారావు, ఢిల్లీరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో ఈనెల 12న నారా లోకేష్ ఎన్నికల శంఖారావం సభ నిర్వహణకు 80అడుగుల రోడ్డులో ఉన్న ఖాళీ స్థలాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పరిశీలించారు. సభా ప్రాంగణం, వేదిక నిర్వహణకు అనువుగా ఈస్థలాన్ని గుర్తించినట్టు ఆమె తెలిపారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు సభ నిర్వహించిన ఈస్థలంలోనే లోకేష్ శంఖారావం సభను కూడా నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఆమెతో పాటు పార్టీ అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, నగర


శ్రీకాకుళం అర్బన్ : స్థలాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీదేవి

టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, రాము పాల్గొన్నారు.

నరసన్నపేట: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి,నారా లోకేష్ చేపట్టిన ఎన్నికల శంఖారావం సభ విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇన్‌ఛార్జి బగ్గు రమణమూర్తి సూచించారు. ఈ నెల 12న నరసన్నపేట నియోజకవర్గం వస్తున్న సందర్భంగా శుక్రవారం జమ్ము జంక్షన్ వద్ద ఏర్పాట్లు చేస్తున్న సభాస్థలాన్ని ఆయన పర్యవేక్షించారు. సిఐ ప్రసాదరావుతో మాట్లాడి ఏర్పాట్లును పరిశీలించారు.

టెక్కలి: టిడిపి యువ నాయకులు నారా లోకేష్ ఆదివారం టెక్కలిలో ఏర్పాటు చేయనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి ప్రకటనలో కోరారు. స్థానిక నాలుగురోడ్ల జంక్షన్ వద్ద నున్న మైదానంలో ఆదివారం నిర్వహించబోవు సమావేశానికి కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న కలిశెట్టి

కలెక్టర్‌ను కలిసిన కలిశెట్టి

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం ఎచెర్ల నియోజకవర్గం పరిధిలో పలు సమస్యలను కలెక్టర్ వివరించి పరిష్కరించాలని కోరారు. ఆయకట్ల పరిధిలో ఉన్న చెరువుల్లో రానున్న వేసవి సీజన్లో పశువుల అవసరాల నిమిత్తం నీటిని నింపాలని కోరారు.

నడిరోడ్డుపై కొట్టుకున్న విద్యార్థులు

ఆమదాలవలస: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నడిరోడ్డుపై కొట్టుకున్న సంఘటన పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పలురకాల మనస్పర్థలతో రెండు గ్రూపులుగా విడిపోయి గత నాలుగు రోజులుగా కళాశాల నుంచి సాయంత్రం వేళ కళాశాల విడిచిపెట్టిన తరువాత బస్‌స్టేషన్‌కు వస్తున్న సమయంలో ప్రతిరోజు గొడవలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. పాలకొండ, సరుబుజ్జిలి ప్రధాన రహదారిపై విద్యార్థులు ఒక్కసారి కేకలు వేసుకుంటూ ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపుల యజమానులతో పాటు ప్రజలు కూడా తీవ్ర భయాందోళన చెందారు. విద్యార్థులు మధ్య తలెత్తిన వివాదాలపై స్థానికులు ఆరా తీయగా కొందరి మొబైల్ ఫోన్లలో అనుమతు లేకుండా వారి అకౌంట్‌లో డబ్బులతో బెట్టింగ్ గేమ్‌లు ఆడినట్లు ఒకరు తెలుపుతుండగా, అమ్మాయిలు విషయంలో విద్యార్థుల మధ్య తలెత్తిన మనస్పర్థలతో వివాదాలు జరుగుతున్నాయని మరికొంతమంది తెలుపుతున్నారు.

కళాశాల సిబ్బంది విద్యార్థుల విషయంలో ఎటువంటి క్రమశిక్షణ చర్యలు చేపట్టకపోవడమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ ఫంక్షన్ నిర్వహించిన అనంతరం సాయంత్రం నడిరోడ్డుపై విద్యార్థులు ప్రవర్తించిన తీరుపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.నిహార్ తన సిబ్బందితో చేరుకుని విద్యార్థులను చెదరగొట్టడంతో వారు పరుగులు తీశారు. పోలీసులు వెళ్లిన అనంతరం ఆర్‌టిసి బస్‌స్టేషన్ వద్ద విద్యార్థులు ఇరు గ్రూపులు మళ్లీ గొడవకు దిగారు. ఇప్పటికైనా కళాశాల సిబ్బంది, స్థానిక పోలీసులు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఆరోగ్య సురక్షతో వైద్య సేవలు

కవిటి: ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పల్లెపల్లెకు వైద్యసేవలు విస్తరిస్తున్నట్టు బెజ్జిపుట్టుగ సర్పంచ్ నారాయణ స్వామి, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య తెలిపారు. బెజ్జిపుట్టుగ సచివాలయం పరిధిలో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బొరివంక పిహెచ్‌సి వైద్యులు తేజ బృందం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌పి ప్రవీణ్, బొరివంక పిహెచ్‌సి వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎంపిడిఒ కొండలరావు, చాపర పిహెచ్‌సి వైద్యాధికారి హేమంత లక్ష్మీ అన్నారు. జోడూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పావని, స్థానిక సర్పంచ్ ప్రతినిధి కూర్మారావు, కార్యదర్శి ఢిలేశ్వరరావు, విఆర్ఒ అప్పలనాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బూర్జ: మండలం మదనాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్-2లో భాగంగా బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారులు


బూర్జ : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రాజశేఖర్

రాజశేఖర్, పావని ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు, వివిధ సమస్యలతో బాధపడుతున్న రోగులను రక్త నమూనాల సేకరించి మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, ఎంపిపి ప్రతినిధి నాగేశ్వరరావు, పిఎసిఎస్ డైరెక్టర్ వావిలపల్లి గోవిందరావు, ఉప సర్పంచ్ డి.వి.నాయుడు, సచివాలయ కన్వీనర్ రామచంద్ర పాడి, పప్పుల రామకృష్ణ, మండల పార్టీ కార్యదర్శి గంద్రేటి రాము పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

పొందూరు: ఈనెల 16న సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరగనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లను విజయవంతం చేయాలని ఎఐకెయంయస్, ఐఎఫ్‌టియు, పలు ప్రజాసంఘాలు నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలం రాపాక కూడలి సమీపంలో గల శ్రీరాజ్యలక్ష్మి పియస్‌యస్ పోల్స్ కంపెనీ వద్ద కార్మికులతో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రజాసంఘాల నాయకులు తాంద్ర ప్రకాష్, సన్నశెట్టి రాజశేఖర్, డి.గణేష్, సార జగన్‌లు మాట్లాడుతూ కార్పోరేట్ల లాభాలను పెంచే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని, మోడీ ఇచ్చిన హామీలు, చేసిన వాగ్దానాలను ఎండగట్టాలన్నారు. కేంద్రంలో ఆర్ఎస్ఎస్ బిజెపి మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్ల కాలంలో మతం ముసుగులో హిందుత్వ, విద్వేష రాజకీయ చదరంగంతో దేశాన్ని కార్పోరేటీకరిస్తోందని, ప్రభుత్వరంగ సంస్థలను కార్పోరేట్‌లకు కట్టబెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సనపల అప్పారావు, గేదెల అప్పలనాయుడు, వండాన రాంబాబు, జగదీష్, కరణం నీలంనాయుడు, రాంబాబు, బాలకృష్ణ సూర్యనారాయణ, కామినాయుడు పాల్గొన్నారు.

పలాస: రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా అధికార పార్టీ వైసిపి, ప్రతిపక్ష పార్టీ టిడిపి, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని, ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు ఈనెల 16న చేపట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఎఐసిసిటియు సభ్యులు కోరారు.. కార్యక్రమంలో ఎఐసిసి నాయకులు కుత్తుం దుశ్యంత్, ఎఐసిడబ్ల్యుఎఫన్ ఆలిండియా కనస్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు భాస్కరరావు, మున్సిపాలిటీ శానిటేషన్ వర్కర్సు ఫెడరేషన్ నాయకులు టి.చాలయ్య, ఎఐసిసి జిల్లా అధ్యక్షులు పోతనపల్లి కామేశ్వరరావు, ఎఐసిసిడియు జిల్లా కమిటీసభ్యులు కుత్తుం లోకనాధం తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం అర్బన్: క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రముఖ వైద్య నిపుణులు దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న బృందావన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల రేజాయిస్ 23 24 సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు విద్యార్థులు పట్టుదలతో విజయాన్ని సాధించాలన్నారు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కషి చేస్తే విజయం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఢిల్లేశ్వరరావు, సెక్రెటరీ దీపక్ రెడ్డి, డైరక్టర్ బరాటం చక్రవర్తి, సిఎఒ రామారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామారావు పాల్గొన్నారు.



వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో చింతాడ గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు అనే పెయింటర్ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. పోలీసుల అందించిన వివరాలు మేరకు శ్రీనివాసరావు ఈనెల 4న పట్టణంలో పూజారిపేటకు చెందిన తోట షర్మిల ఇంటి మేడపైన పెయింటింగ్ వర్క్ చేస్తూ సాయంత్రం ఐదు గంటల సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాల పాలైనట్లు తెలిపారు. గాయపడిన శ్రీనివాసరావును రాగోలు జేమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించినట్లు తెలిపారు. భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తొగరాంలో...


అప్పలరాజు (ఫైల్)

మండలంలోని తొగరాం గ్రామానికి చెందిన తమ్మినేని అప్పలరాజు(45) భవన నిర్మాణ కార్మికుడు హైదరాబాద్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే అప్పలరాజు హైదరాబాద్‌లో భవన నిర్మాణ పని చేస్తుండగా మూడో అంతస్తు నుంచి జారి కింద పడడంతో తోటి భవన నిర్మాణ కార్మికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు శుక్రవారం గ్రామంలో కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడు అప్పలరాజుకు భార్య భారతితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అప్పలరాజు మృతితో తొగరాం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

మండలంలో కంబిరిగాం జాతీయ రహదారి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలో నారాయణపురం గ్రామానికి చెందిన పిట్ట మాధవరావు, పిట్ట మోహనరావులు ద్విచక్ర వాహనంపై పలాస నారాయణపురం వైపు వెళ్తున్న సమయంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో పొలాల్లోకి దూసుకు పోయింది. దీంతో మోహనరావు, మాధవరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా జరిగిన వెంటనే 108 వాహన సిబ్బంది సత్యం, శ్రీనివాసరావు ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లిఫ్ట్‌లో ఇరుక్కున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన లిఫ్ట్ మొరాయించడంతో పలువురు ప్రయాణికులు ఆందోళన చెందారు. శుక్రవారం లిఫ్టులో కొంతమంది ప్రయాణికులు ఎక్కిన తరువాత లిఫ్టు మొరాయించి మధ్యలో ఆగిపోయింది. దీంతో లోపల ఉన్న చిన్నారులు, మహిళలు హహాకారాలు పెడుతూ ఆందోళన చెందారు. ఉదయం 9:40 నుంచి 10.15 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో లిఫ్ట్ మధ్యలో ఆగిపోయినట్లు రైల్వే సిబ్బంది చెబుతున్నారు. లిఫ్ట్ లోపల ఉన్న ప్రయాణికులు ఆర్తనాదాలు పెట్టడంతో చుట్టుపక్కల ఉన్న వారంతా అక్కడకు చేరుకొని రైల్వే అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు ఆర్‌పిఎఫ్ పోలీసులు అక్కడకు చేరుకుని విద్యుత్తును పునరుద్ధరించడంతో పైకి చేరుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లిఫ్ట్ నిర్వహణపై రైల్వే అధికారులు దృష్టి పెట్టడంలేదని, పలుమార్లు ఇటువంటి ఘటనలే పునరావృతం అవుతున్నాయని పలువురు రైల్వే ప్రయాణికులు చెబుతూ రైల్వే అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు లిఫ్ట్ సంఘటనలపై దృష్టిపెట్టి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నేడు యధావిధిగా పాఠశాలలు

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు యధావిధిగానే ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్, పాఠశాలలు తెరుచుకోనున్నాయి. రెండవ శనివారం సెలవు దినం అయినప్పటికీ పాఠశాల ఏడాదికి పనిచేసే రోజులు చాలనందున రెండవ శనివారం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. గతేడాది డిసెంబర్‌లో ఏర్పడ్డ మిచౌంగ్ తుఫాన్ కారణంగా రెండు రోజులు సెలవులు ఇవ్వడం, ఈ ఏడాది జనవరి నెలలో సంక్రాంతి సెలవులు రెండు రోజులు పొడిగించిన క్రమంలో పాఠశాల పనిచేసే దినాలు తగ్గడంతో రెండవ శనివారం యధావిధిగా పాఠశాలలు తెరుచుకోవాలని విద్యాశాఖ ఆదేశాలతో పాఠశాలలు తెరుచుకోనున్నాయి.

అభివృద్ధికి చిరునామా వైసిపి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వైసిపి ప్రభుత్వం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుందని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పల్లివూరు సచివాలయ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎప్పుడూ లేని అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకు రావడానికి సిఎం జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మామిడి భాస్కరరావు, దున్న బాలరాజు, మాజీ సర్పంచ్ సాన కృష్ణారావు పాల్గొన్నారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- జి.సిగడాం

మండల నూతన తహశీల్దార్‌గా అర్.ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎఒగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతానన్నారు. బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించారు.


తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది



గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులు

పిల్లలవలసలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- పొందూరు

మండలం పిల్లలవలస పంచాయతీలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు పర్యవేక్షణలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో పలువీధుల్లో కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను, మురుగును, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ పారిశుధ్య పనులకు 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



అచ్చిపోలవలసలో సామాజిక తనిఖీలు చేపడుతున్న బృందం

ముమ్మరంగా సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో పలు గ్రామాల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం నిధులతో జరిగిన పలు రకాల పనులపై శుక్రవారం సామాజిక తనిఖీలను చేపట్టారు. మండలంలో అచ్చిపోలవలస, కింతలి, రాపాక, కోటిపల్లి, పొందూరు, మలకాం, కేశవదాసుపురం గ్రామాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. గ్రామంలో జరిగిన పనులపై అందజేసిన వేతన వ్యయాలు, సచివాలయాల పరిధిలో చేపట్టిన ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించి తనిఖీలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి చంద్రమోహన్, ఎపిఒ శ్రీనివాసరావు, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

పోలాకి: 2012 నుంచి డీలర్లుకు రావాల్సిన ఐసిడిఎస్, ఎండిఎం బకాయిలు రిలీజ్ చేయడంతో డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జగన్, పంచిరెడ్డి రాజులు, కణితి సత్తిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ కార్యాలయం వద్ద సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఎన్నాళ్ల నుంచో మేము పడుతున్న బాధలు గర్తించిన సిఎం జగన్ మోహన్ రెడ్డికి, పౌర సరఫరాల శాఖ మంత్రి కె.నాగేశ్వరరావు, ఎంఎల్ఎ ధర్మాన కృష్ణదాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, సిఎస్‌డిటి రామకృష్ణ, అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌కు సత్కరించారు. కార్యక్రమంలో డీలర్లు వెంకటేశ్వరరావు, చింతు రామకృష్ణ, భాస్కరరావు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విజేతలకు కూపన్ల పంపిణీ

పలాస: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఇటీవల పాతపట్నం, ఘూటీ, పొత్తంగి రూట్‌లో ప్రయాణం చేసి లక్కీ డ్రాలో విజేతలు రాజేశ్వరి నౌపడ, తమ్మిరెడ్డి, రుక్మిణి, యు.రోజా, భామిని త్రినాథ్, పార్వతీశంకు శుక్రవారం డిపో మేనేజర్ రోణంకి సీతారాం నాయుడు లక్కీ షాపింగ్ మాల్ వెయ్యి రూపాయల కూపన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్కీ షాపింగ్ మాల్ మేనేజర్ వీరస్వామి, ఆర్‌టిసి డిప్యూటీ మేనేజర్ సంతో కుమార్ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

కొత్తూరు: మండలంలోని గులివిందలపేట గ్రామానికి చెందిన బంటు లోకేష్ (22) అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా కుమారుడు విగత జీవిగా ఉండడంతో ఇరుగు పొరుగు వారిని పిలిచి దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు గల కారణమని తండ్రి రామారావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు ఐటిఐ చేసాడు. ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడని తండ్రి తెలిపారు. ఎస్ఐ మహమ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఆమదాలవలస: మాదకద్రవ్యాలతో విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రాజారావు అన్నారు. శుక్రవారం పట్టణంలో జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం అధికారి జె.రవిబాబు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదకద్రవ్యాలను సేవించడం వలన నాడీ వ్యవస్థ పూర్తిగా స్తంభించి జీవితాలు పాడవుతాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.ఎల్.కరుణ లత, హెడ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజారావు

కానిస్టేబుల్ శ్రీరామమూర్తి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్.వి.ఎల్.నారాయణరావు, విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మేమే వేస్తాం

ప్రజాశక్తి- కవిటి

రాబోయే ఎన్నికల్లో జనసేన, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే కొమ్ముపుట్టుగ గ్రామానికి పక్కా రహదారి వేస్తామని జనసేన నాయకుడు దాసరి రాజు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి తమ పార్టీ తరుపున కొన్ని కంకర లోడులు వేసి తాత్కాలిక రహదారి వేస్తామని చెప్పారు. ఇటీవల కొమ్ముపుట్టుగలో రహదారి నిర్మాణం కోసం గ్రామస్తులు ర్యాలీ నిర్వహించి విరాళాలు సేకరించారు. 'రోడ్డు నిర్మాణానికి విరాళాల సేకరణ' అంటూ ప్రజాశక్తి వార్త కూడా ప్రచురించింది. విషచం తెలుసుకున్న దాసరి రాజు, జనసైనికులు, టిడిపి



గ్రామస్తులతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న రాజు

కార్యకర్తలతో కలిసి శుక్రవారం కొమ్ముపుట్టుగ రహదారి పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దుగాన దివాకర్, హేమా చలపతి, మధు, శేఖర్, జ్ఞానేశ్వర్, ధనుంజయం, జోగారావు, డొక్కరి ఈశ్వరరావు, రోకళ్ళ భాస్కర్, నాగరాజు, సతీష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

పలాస: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని లక్ష్మీపురం టోల్ ప్లాజా ప్రాజెక్టు మేనేజర్లు సింథిల్ కుమార్, వి.వి.కె.వి ప్రసాద్ అన్నారు. శుక్రవారం లక్ష్మీపురం టోల్ ప్లాజా ఆవరణలో ఎన్.హెచ్.ఎ.ఐ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో టోల్ ప్లాజా సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని 53 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ సంస్థకు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ వాలంటీర్ చైతన్య, ఆర్.ఇ నాగేశ్వరరావు, టోల్ ప్లాజా మేనేజర్ అనిషనిజాన్, సేఫ్టీ మేనేజర్ కిరణ్‌కుమార్, జి.మోహనరావు, ఐఎం మేనేజర్ ధనరాజ్, ఐఎంటి సిబ్బంది, మెడికల్ సిబ్బంది, టోల్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

గార: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని అంపోలులో గల జిల్లా కేంద్ర కారాగారాన్ని శుక్రవారం పరిశీలించారు. ఖైదీలతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జైల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. 18 ఏళ్లు నిండని మైనర్లను జైల్లో ఉంచరాదని అధికారులకు స్పష్టం చేశారు. మైనర్లు ఎవరైనా ఉంటే వారిని హోంల్లో చేర్చాలన్నారు. న్యాయవాదులను పెట్టుకునే ఆర్థిక స్తోమత



ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

లేకపోతే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని నియమించి కేసు నడిపిస్తుందని తెలిపారు. ఆయనతో పాటు జిల్లా జైలరు ఉదయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో హడ్కో కాలనీలో టిడిపి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చించివేసారు. ఈ సంఘటన పట్ల టిడిపి శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మెట్టెక్కివలస టిడిపి యువ నాయకులు నాగళ్ల మురళీధర్ ఆధ్వర్యంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌ను కలిసి టిడిపి ఫ్లెక్సీని చించివేసినట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన రవికుమార్ గ్రామాల్లో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా టిడిపి శ్రేణులు జాగ్రత్త పడాలని,



ఎస్ఐ వెంకటేష్‌కు ఫిర్యాదు చేస్తున్న మురళీధర్

ఫ్లెక్సీలు చించివేత విషయం పోలీసులకు తెలియజేయాలన్నారు. టిడిపి నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఎస్ఐ కె.వెంకటేష్‌కు టిడిపి ఫ్లెక్సీలు చింపివేసిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

ఎంపిడిఒకు వీడ్కోలు

ఆమదాలవలస: సరుబుజ్జిలి ఎంపిడిఒగా విధులు నిర్వహించి అనకాపల్లి బదిలీపై వెళ్లిన ఎంపిడిఒ పివివి మురళీమోహన్ కుమార్‌కు ఘన వీడ్కోలు పలికారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు కెవివి సత్యనారాయణ, జెడ్‌పిటిసి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో సన్మానగ్రహీత మురళీమోహన్ మాట్లాడుతూ ఎంపిడిఒగా తాను విధులు



ఎంపిడిఒను సన్మానిస్తున్న నాయకులు

నిర్వహించిన సమయంలో సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు గోవింద్, వెంకట శివానందమూర్తి, లావేటి అనిల్ కుమార్, తహశీల్దార్ శ్యాం కుమార్, ఎస్ఐ బి.నిహార్ పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పల్లివూరు సచివాలయ భవనాలను రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం ఉదయం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మామిడి భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా కంబాలరాయుడుపేట సచివాలయ భవనాలను మంత్రి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభిస్తారని సర్పంచ్ వంక చిరంజీవి తెలిపారు.

వైసిపి విముక్తి కోసం ఎదురుచూపులు

కోటబొమ్మాళి: ప్రజలిచ్చిన అధికారాన్ని అడుగడుగునా దుర్వినియోగం చేయడమే కాకుండా తన అసమర్థపాలనతో సిఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, తెలుగుమహిళ అధ్యక్షురాలు పూజారి శైలజలు అన్నారు. శుక్రవారం అక్కయ్యవలసలో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అరాచకాలకు ముగింపు పలికే సమయం అసన్నమైందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పట్ట సింహాచలం, కర్రి అప్పారావు, శిమ్మ సింహాచలం, శ్రీనివాస్, అప్పలరాజు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

కోటబొమ్మాళి: ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ శాతం మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోకపోవడంతో మృతిచెందుతున్నారని, ప్రతిఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి అన్నారు. శుక్రవారం కొత్తపేట జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకుంటే జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో హెల్మెట్ ధరించని15 మంది వాహనదారులకు ఒకొక్కరికి రూ.135లు జరిమాన విధించినట్టు ఆయన తెలిపారు.

పేదలకు అల్పాహారం అందజేత

శ్రీకాకుళం అర్బన్ : ఆపత్బాంధవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గురుగుబిల్లి చంద్రశేఖర్ తన జన్మదినాన్ని పురష్కరించుకుని నగరంలో పలుకూడళ్లతో పాటు రిమ్స్ ఆస్పత్రిలో నిరుపేదలకు అల్పాహారం, పండ్లు పంచి పెట్టారు. శుక్రవారం ఏడు రోడ్ల కూడలి నుంచి పాత బ్రిడ్జి, కొత్త బ్రిడ్జి, బలగ రిమ్స్ వైద్యశాలలో 180 మందికి అందించామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ డాక్టర్ టి.మణికంఠ, ఉర్లం శివతేజ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు శ్రమించాలి

పొందూరు: విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరంగా శ్రమించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణవాసుదేవరావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్సికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వేషదారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోమనోహర్, అధ్యాపకలు మల్లీశ్వరరావు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రవి, కె.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.4.67 లక్షలు

కోటబొమ్మాళి: స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఆరు ధర్మహుండీలను శుక్రవారం లెక్కించగా 69 రోజులకు రూ.4.67.269లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్. రవికుమార్ ఆద్వర్యంలో ఈ హుండీల లెక్కింపు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ బోయిన మాధవి, కమిటీ సభ్యులు, బెవర పుణ్యావతి, సకాలభక్తుల తిరుమలరావు, దేవాదాయశాఖ సిబ్బంది, ఆలయ అర్చకులు కమ్మకట్టు అప్పలరాజు రెడ్డి, కమ్మకట్టు మాధవరెడ్డి, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.